

# చలువ పందిరి

యర్రమిల్లి విజయలక్ష్మి

కొరియర్ సర్వీస్ బోయ్ కవరు ఇచ్చి వెళ్ళాడు: సాహు రాసాడు. అతను ఎందుకు నాకు ఉత్తరం రాసి వుంటాడు? ఏమన్నా ఇంటి సమస్యా... ఆలోచిస్తూనే కవరు చించి చదివాను. చిన్న స్క్రిప్లింగ్ పేన్ మీద నాలుగు వాక్యాలున్నాయి.

మేడం! మీ ఇంటి తూర్పువైపునున్న వేప చెట్టు చాలా పెద్దదైంది. గోడను డామేజ్ చేస్తోంది. ఇప్పటికే రెండు, మూడు క్రాక్స్ ఇచ్చింది. వెంటనే మీరు నిర్ణయం తీసుకుని వేపచెట్టును కొట్టించటం మంచిది. ఆలస్యం చేస్తే మొత్తం గోడ దెబ్బతింటుంది. ఇదీ ఉత్తరం సారాంశం.

సాహు ఇటీవలే కోలకటానుంచి ప్రమోషన్ మీద వచ్చాడు. అతను రావటం నేనక్కడ్నించి కదలటం ఇంచుమించు ఒకే సారి జరిగింది. ఇంటి విషయం ఏం చెయ్యాలాని నేను మథనపడుతుంటే సాహు మా ఇంటిని లీజ్‌కి తీసుకుని నా భారం కొంత తగ్గించాడు. చిన్న పొదిరిల్లు లాటి పొందికైన బిల్డింగ్- విశాలమైన ఆవరణలోవున్న పచ్చని చెట్లు అతన్ని బాగా ఆకర్షించాయి. అతను మా ఇంటిని ఒక టెనెంట్‌లాకాక మాలాగే ఎంతో శ్రద్ధగా చూసుకుంటున్నాడని నా ఫ్రెండ్స్ రిపోర్టు చేస్తుంటారు. ఇది నన్ను మరింత ఆనందపరిచింది. సాహు మా ఇంట్లో వున్నంత కాలం దాన్ని గురించి చింత పడవలసిన పనిలేదని నమ్మకం కలిగింది. ఇప్పుడీ లెటర్ నా అభిప్రాయాన్ని బలపరిచింది. అతనింత బాధ్యతగా చెట్టు సమస్య తానుగా రాయటం నాకు ఒకే రకంగా సంతోషాన్ని కలిగించింది. నిజానికీ విషయం అతను పట్టించుకోవలసిన అవసరం లేదు. ఎందుకు పట్టించుకోలేదన్న ప్రశ్న కూడా రాదు. అడిగే హక్కుకూడా నాకు లేదు. అయినా అతని మంచితనంవల్ల బాధ్యత ఫీలై ప్రాబ్లం రాశాడు. ముందు అతని ఉత్తరం చూడగానే నాలో కలిగిన స్పందన ఇది. ఆ అల కాసేపటికి వెనక్కి మళ్ళింది.

అవును వేపచెట్టు చాలా పెద్దదైంది. కాంపౌండు వాల్ మీదకు ఒరిగి బాలన్సవుతూ చిలవలు పలవలుగా వీధివైపుకి విశాలంగా విస్తరించింది. పదిహేనేళ్ళ వయసున్న చెట్టది. రెండుబారలు విస్తీర్ణంకల బలమైన మానుతో దట్టమైన హరిత ఛత్రంలో ఆకాశమంతెత్తు ఎదిగింది. రోడ్డు పోయే వాళ్ళకి అది ఎండకూ, వానకూ కూడా షెల్టర్‌లా ఆశ్రయమిస్తుంది. మధ్యాహ్నాలు వేపచెట్టు మీంచి చల్లగాలి ఏసీని మించిన చలవ తనాన్ని ఇంటినిండా ప్రసరింపచేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అది మా ఇంటికి ఒక ప్రత్యేక ఆకర్షణ. ఇంటి ఆవరణలోనున్న చిన్న, పెద్ద మొక్కలు వేరు దీని అందంవేరు. మా ఇంటికే 'వేపచెట్ల ఇల్లని' ఒక గుర్తింపు తెచ్చిపెట్టింది. వేసవి రాత్రుళ్ళు వేప చెట్టు క్రింద వున్న బండమీద పడుకుని వెన్నెల చల్లదనంతో నిండిన ఆరోగ్యకరమైన చల్లని గాలి గుండెల నిండా పీల్చుకుని 'దొరలు మేసే గాలి' అనుకునేవాళ్ళం. ప్రతీ మనిషికి చేస్తున్న వృత్తికాక ఒక అభిరుచి వుంటుంది. మా అభిరుచి చెట్ల పెంపకం. గార్డెనింగ్, సరదాగా ఇంటి ఆవరణ అందంగా చూడముచ్చటగా వుండాలన్న ఆశ మా హాబీకి నాంది. మేం ఇల్లుకట్టుకోవటం ప్రారంభించక ముందే నర్సరీనుంచి రకరకాల అంట్లు, మొక్కలు, క్రోటన్సు సేకరించటం ప్రారంభించాం. ఇంటికి నాలుగు వైపులా విశాలంగా ఖాళీస్థలం వదిలి మధ్యలో చిన్న డాబా కట్టుకున్నాం. ముందుభాగంలో పూల మొక్కలు, క్రోటన్సు పక్కల వెనుక జామ, మామిడి, సపోట, నిమ్మ, అరటి లాటి ఫలవృక్షాలు ఒక్కోటి చొప్పున పెంచుకున్నాం. మా పిల్లలు చిన్నవాళ్ళుగా వున్నప్పుడు మాతో కలిసి మొక్కలకు నీళ్ళు పోయటం, ట్రిం చెయ్యటం వాటి పనులు చేస్తుండేవారు. ప్రతి ఉదయం కొత్తగా పూసే పూలను చూస్తూ సంబరపడిపోయేది మా హారిక. ప్రతిరోజు మా టీచర్‌కనో ఫ్రెండ్‌కనో బతిమాలుకుని రెండు రోజెస్ కోసుకుపోయేది. ఈ విషయంలో హారికకి విపుల్‌కీ రోజూ గొడవే. వాడప్పుడు టెన్త్‌లో వుండేవాడు. హారి సెవెంత్‌లో వుండేది. వాళ్ళిద్దరు +1నుంచి రెసిడెన్షియల్‌కి వెళ్ళిపోయారు. వాళ్ళకి అప్పట్నించీ పోటీ మనస్తత్వం అబ్బి- సున్నితమైన సెంటిమెంట్స్ మాకే తెలియకుండా మెల్లిగా మాయమైపోయాయి. మనిషి పెద్దవాడై బయటి ప్రపంచంలోకి పోతుంటే పసితనపు లాలిత్యం- సుకుమార భావాలకు దూరమై మెదడుకు తప్ప మనసుకి ప్రాధాన్యత నివ్వటం తగ్గి పోతుందేమో! నా పిల్లలూ లోక విరుద్ధంగా లేరు. వాళ్ళ చదువులు- ఉద్యోగ బాధ్యతల్లో పడిపోయి ఫ్రంట్ రోలోకి చేరటమే ధ్యేయంగా పరుగులు తీస్తున్నారు తప్ప మిగతా విషయాలన్నీ అనవసరంగా కనిపిస్తున్నాయి. అమ్మ, నాన్న- ప్రేమలు, అభిమానాలు- మేం వాళ్ళకోసం జీవితకాలం శ్రమించి సేకరించిన ఇల్లు-వాకిలీ అన్నీ ఏవిధమైన మినహాయింపు లేకుండా అందులో కలిసిపోయాయి. పెద్దల ద్వారా సంక్రమించిన కొద్దిపాటి ఆస్థినీ- పల్లెలో మా తాతముత్తాతలు నివసించిన పాతకాలపు ఇంటిని వదులుకోలేక- ఉద్యోగ బాధ్యతలు తీరిపోయాక మా స్వస్థలానికి చేరుకున్నాం. నిజానికి నా మనసంతా మేం కష్టపడి కట్టుకున్న మా ఇంటిమీదే వుంది. కానీ వాళ్ళకు అవసరంవున్నా లేకపోయినా పిల్లలకోసం ఏమన్నా ఓపికున్నంతవరకూ చెయ్యాలన్న తపన ఈ లోకంలోని అందరి తల్లిదండ్రులకు మల్లే మాకూ వుంది.

''నేను అందుకే ముందే చెప్పాను. ఇక్కడ మనకు వున్నది జాగ్రత్తగా చూసుకుంటే చాలురా అబ్బాయీ- అంతంత దూరం ఉద్యోగానికనిపోవటం ఎందుకని... విన్నాడా...? ఆయన దూరంలోవున్న విపుల్‌ని తలచుకుని బాధపడ్డారు. ప్రతీ చిన్న విషయానికి కొడుకు దగ్గరలేడే అని దిగులు పడటం ఆయనకి పరిపాటి అయిపోయింది.

''-దీనికీ వాడికీ సంబంధమేముంది. వాడిక్కడ వున్నా మన ఇష్టప్రకారమే చెయ్యమంటాడు. ఇటువంటివి వాడసలు పట్టించుకోడు'' అన్నాను కానీ చెట్టు విషయం ఏ నిర్ణయం తీసుకోవాలా? అని మనసులో మథనపడుతున్నాను.

ఫాను రెక్కతగిలి పిచ్చిక చచ్చిపోయిందని రెండ్రోజులు అన్నం మానేసి దిగులు పడిన మనిషి... వేప చెట్టు కొట్టించెయ్యాలంటే ఆ మనసు ఎంత బాధపడుతుందో తెలుసు. అయినా తప్పదు గోడ దెబ్బతింటే పాతికవేలు ఖర్చు- అప్పుడైనా చెట్టు తీయించక తప్పదు. అదేదో ఇప్పుడే చేస్తే అనవసరమైన ఖర్చు, శ్రమ తప్పుతుంది. సాహు చెప్పింది నిజమే. అతను మా దృష్టిలో ఆలోచించి హెచ్చరించాడు. సెంటిమెంట్స్ ఎల్లప్పుడూ పనిచెయ్యవు. వాటికి మనిషి లొంగిపోవటం కూడా అంత మంచిదికాదు. గోడ దెబ్బతినే పరిస్థితిలో చెట్టు అట్లాగే వుంచాలని ఎవరూ అనుకోరు. కొంత ప్రాక్టికల్ థింకింగ్ అవసరం. చెట్టుకోసం గోడను పాడుచేసుకోవాలనుకోవటం అవివేకం. అసహజం కూడాను. అయితే ఈ వాదన ఆయనకు నచ్చదు. 'ఎంతో శ్రద్ధగా పెంచుకున్నాం. ఇన్నేళ్లు మనలో ఒకరన్నట్టే మన జీవితంతో కలిసిపోయింది. ఏ తుఫానో వచ్చి పడిపోతే పోనీ. అది వేరు విషయం. చెట్టు పెద్దదై ఎండి మోడైపోతే అదీ వేరు... ఏపుగా ఆరోగ్యంగావున్న పచ్చని చెట్టును ఎల్లా చేతులారా కొట్టేస్తాం... పోతే పోయింది గోడ... దాన్ని మాత్రం తాకటానికి వీల్లేదు... నిశ్చితాభిప్రాయం వెలిబుచ్చి పేపర్లో తల దూర్చేసుకున్నారు. మోతాదును మించిన మంచితనం అసమర్థతని పంచుకుంటుంది. చెట్టు పట్ల ఆయన పెంచుకున్న వ్యామోహం అసహజమనిపించుకుంది. ''దానిలోనూ జీవముంది. మన ఇష్టమున్ననాళ్ళు పెంచుకుని - ఇబ్బంది వచ్చిందని కొట్టించి పడేస్తానంటే ఎల్లా... వుండనీ ఏం ఫరవాలేదు... ఆ సాహుకి చెప్పు ఇంకా విషయం ఎత్తద్దని...''

ఏం చెప్పాలి...! ఇంత అవివేకం ఎక్కడైనా వుంటుందా ఇటువంటి విపరీత ఆలోచనలతో ఈ ప్రపంచంలో మనిషి బతగ్గలడా... అందుకేగా జీవితమంతా ఎన్నో ఎదురుదెబ్బలు. ఇంటాబయటా సమాజంతో ఇమడలేని మానసిక సంఘర్షణ మనిషికి ఈయన సిద్ధాంతాలు ఆలోచనలూ, ఆవేశాలు అన్నీ లోకవిరుద్ధమైనవే. బోధిసత్త్వుడు కాలేకపోయినా గౌతమబుద్ధుడే. కష్టాన్ని చూడలేడు... దుఃఖాన్ని భరించలేడు- వయసు పెరిగి- మానసిక పరిపక్వత వచ్చినా పసితనపు హృదయ సౌకుమార్యం పోలేదు. మనసును చివుక్కుమనిపించే అనేక విషయాలను ఈయన దృష్టిలో పడకుండా దాచిపెట్టటం నాకలవాటైంది. పిల్లలు కూడా ఆయన మనసుకు కష్టం కలిగించే విషయాలు ప్రస్తావించ కూడదని గ్రహించారు.

**'మేడం...! వేప చెట్టు సమస్య నేను పరిష్కరించాను. గోడకి ఏమీ ప్రమాదం లేదు. మీరు వర్రీ కాకండి... 'వీలు చూసుకుని ఒకసారి రాగలరు.'**

ఎప్పుడూ సంగీతం- సాహిత్యం- ప్రకృతి ఆరాధన- పుస్తక పఠనం చాటున తల దాచుకుని బాహ్య ప్రపంచాన్ని పట్టించుకోని భావుకుడు.

సరే ఆ విషయం అటుంచి ఇప్పుడు వేప చెట్టు విషయం సాహుకి ఏం చెప్పాలి. అన్నది తక్షణ సమస్యై కూర్చుంది ఆయనగారి అభిప్రాయమైతే తెలిసిపోతూనే వుంది. గోడకాదుకదా... మొత్తం ఇల్లంతా కూలినాకాని వేప చెట్టు మాత్రం తాక్కూడదనేది ఆయన అంతరంగం. కానీ నేను మాత్రం అల్లా అనుకోలేకపోతున్నాం. ఆయనకంటే ఒక పాలు భౌతికత అలవరుచుకున్నానేమో చెట్టుకన్నా గోడ పరిరక్షణ సమస్యే నన్ను బాధిస్తోంది చెట్టుకోసం బంగారంలాంటి ప్రహరీగోడని పాడుచేసుకోవటం కేవలం తెలివిమాలిన పనని ఎవరన్నా సరే నిర్ద్వంద్వంగా చెప్తారు. ఇంకో రకంగా చెప్పే వాళ్ళు. ఈయన సెంటిమెంట్స్ని గౌరవించే వాళ్ళే తప్ప- వాళ్ళే స్వయంగా అటువంటి సమస్యను ఎదుర్కోవలసి వస్తే రెండో ఆలోచనకు తావీయకుండా గోడ రక్షణకే పూనుకుంటారు. ఎదుటివాళ్లకు సలహాఇవ్వటం వేరు. సమస్యని స్వయంగా పరిష్కరించుకోవలసిన స్థితి వేరు. అందువల్ల ప్రస్తుతం ఏం చెయ్యాలన్నది మేంతీసుకోవలసిన నిర్ణయం తప్ప- చర్చకు పెట్టటంవల్ల పరిష్కారమార్గం దొరకదు. ఆయనలో కూడా ఈ విషయం పదే పదే ప్రస్తావించి ప్రయోజనం లేదని తెలిసిపోయింది. రెండు కారణాలవల్ల నేనూ స్పష్టమైన నిర్ణయానికి రాలేకపోతున్నాను. ఒకటి ఆయన మనసుకి వ్యతిరేకంగా పోవటం- రెండోది స్వయంగా నేనూ వేప చెట్టుమీద పెంచుకున్న మమకారం... తటస్థంగా రోజులు కొన్నాళ్ళు గడిచిపోయాయి. 'ఏం జరుగుతుందో... చూద్దాంలే... మరీ అంతగా భయపడవలసిన పనుండకపోవచ్చు'అని నేను సర్దుబాటు చేసుకున్నా- సాహు మాత్రం ఊరుకునేట్టు లేదు. ఈసారి ఓ రాత్రిపూట ఫోన్ చేసాడు. ఆ సమయానికి ఆయన ఇంట్లో లేకపోవటం ఒక అదృష్టం వుండి వుంటే- నిర్మొహమాటంగా ఫోనులోనే తన ధోరణిలో సాహుని వాయించేసి వుండేవారు.

''సార్తో చెప్పారా... ఏమన్నారు చెట్టు విషయం- మూడుచోట్ల సన్నగా క్రాక్స్ కనిపిస్తున్నాయి. మనుష్యలకి చెప్పి వుంచాను. ఉడ్ పనికి వస్తుంది కాబట్టి ఏమీ చేసుకోకుండా వాళ్ళే కొట్టుకుని తీసుకుపోతారు. మీతో మాట్లాడి చెప్తానన్నాను. మీరు సరేనంటే రేపు సండే... మాకు సెలవుకదా... ఇంట్లోనే వుంటాం దగ్గరుండి చేయిస్తా జాగ్రత్తగా కొట్టకపోతే మొత్తం గోడ దెబ్బతినే ప్రమాదముంది. ఏం మేడం... ఏమంటారు...?''

అతను టెనెంట్లై వుండీ, చూపిస్తున్న శ్రద్ధకు ఇప్పుడు నాకు ఆనందం కలగటంలేదు. విసుగనిపిస్తోంది. ఇతనికాగోడ గురించి ఎందుకంత అక్కర... చెట్టు పడగొట్టాలని తొందర పడుతున్నాడనిపిస్తోంది. అతని మాటలు వింటుంటే గోడకు కాదు నా గుండెకే పగులుపడుతున్నట్లు బాధగా వుంది. ఎల్లాగో చేప్పేసాను. 'కొంతకాలం ఆగి చేయిస్తాను... ఆయన ఊళ్ళో లేరు. మళ్ళీ చెప్తాను. ప్రస్తుతానికి ఇబ్బందేం లేదు కదా... దాన్నలాగ వుండనియ్యి...''

కొంతకాలం గడిచింది. సాహు నుంచి ఈమధ్యకాలంలో సమాచారం ఏమీ లేదు. గోడ/ వేపచెట్టు సమస్య మా మనస్సుల్లోంచి తొలగిపోయింది. ఆ విషయం కన్వీనియంట్గా మర్చిపోవటమే మా మానసిక ఆరోగ్యానికి మంచిదనుకున్నాను. కానీ సాహు మమ్మల్ని ప్రశాంతంగా వుండనిచ్చేట్టు లేదు. దుష్టాంగాన్ని ఖండించి శిష్టాంగాన్ని పరిరక్షించవలసిన గురుతర బాధ్యత తన భుజస్కంధాలమీదే వున్నట్లు ఫీలైపోతున్నాడు లాగుంది. మళ్ళీ కొరియర్లో, లెటర్ రాసాడు.

'మేడం...! వేప చెట్టు సమస్య నేను పరిష్కరించాను. గోడకి ఏమీ ప్రమాదం లేదు. మీరు వర్రీ కాకండి... వీలు చూసుకుని ఒకసారి రాగలరు.'

ఎలా పరిష్కరించాడు... 'ఓరి దుర్మార్గుడా... అయితే వేపచెట్టు కొట్టించేసావేమిట్రా...! పరిష్కరించేసానని ఆనందంగా రాస్తున్నాడు. మీరేం బాధపడద్దంటున్నాడు. అంటే దానర్థం అదేకదా. వివరించలేని బాధ నా మనసునావరించుకుంది. 'తరువాత చూద్దాం- ప్రస్తుతం దాన్నల్లా వుంచెయ్యమ'ని చెప్పినా సాహు ఇలా చేసాడేమిటి? కోపంతోనూ దిగులుతోనూ నేను తడబడిపోయాను. వెంటనే ఫోన్చేసి ఛెడా, మడా దులిపెయ్యాలన్నంత ఆవేశం కలిగింది. అయితే అది క్షణికమే. పాపం అతను మాత్రం ఏం చేస్తాడు? మేం చూస్తే ఏ మాటా తేల్చిచెప్పలేక పోతున్నాం. ఆలస్యం చేస్తే గోడ పూర్తిగా దెబ్బతింటుందని భయపడి వుంటాడు. అతనేం కావాలని చేసాడా... చెట్టు కొట్టిస్తే అతనికేం లాభం... మా మేలుకోరే ఆ పని చేసాడు. అల్లాంటప్పుడు అతడ్ని నిలదీసి చిన్నపుచ్చటమెందుకు? ఏదో దూరాన వున్నామని పూనుకుని ఉపకారం చెయ్యబోయినందుకు ఇదా ఫలం అని బాధపడదూ. నేను ఏమీ తెలియనట్టే నిశ్శబ్దంగా వుండిపోయాను. అతను నాకే రాయటం మంచిదైంది. లేకుంటే ఎంత గందరగోళం జరిగేదో. ఈ విషయం కాని తెలిస్తే ఆయన ప్రతిస్పందన ఎంత తీవ్రంగా వుంటుందో... ఊహించటానికే భయం కలిగించింది. అప్రియం సత్యమైనా చెప్పకూడదన్నారు కదా... నోరు మూసేసుకున్నాను. అప్పుడప్పుడు చెట్టు గుర్తువచ్చి మనసు చివుక్కుమంటున్నా పరిస్థితిని అర్థం చేసుకుని తనంత తనే సమస్యని పరిష్కరించటం కాస్త రిలీఫ్నే కలిగించింది.



గాలికి తెల్లని వేప పూలు నాపైన రాలుతున్నాయి. 'గోడకోసం నిన్ను కొట్టించెయ్యాలనుకున్నానే... నీకెందుకమ్మా... ఇంత ప్రేమ...' అవును చెట్టు మనిషినెప్పుడూ ప్రేమిస్తూనే వుంది. చెట్టుని ప్రేమించే మనిషి కావాలి.

సంవత్సరం తిరిగి పోయింది. ఈమధ్యకాలంలో సాహునుంచి సమాచారమేమీ లేదు. చెట్టు విషయం నా మనసులోనే రహస్యంగా వుంచేసాను. మనసెంత ఆరాటపడినా అటువైపు పోవటానికి ధైర్యం చాలలేదు. ఇప్పుడు వెళ్ళి చేసేది మాత్రం ఏముంది? కళ, కాంతీ లేక బోసిపోయిన కాంక్రీటు కట్టడాన్ని చూసుకోవటం తప్ప జీవాన్ని కోల్పోయిన కళేబరంలాటి ఇల్లు పీడకలలా నన్ను వెంటాడి రాత్రుళ్ళు నిద్రలేకుండా చేసేది. సంతోషకరమైన ఆ విషయాన్ని మర్చిపోవాలని ఎంత ప్రయత్నిస్తున్నా మనసు మూలల్లో నక్కివుండి. ఏదో ఆలోచనల మధ్య బయటకు వచ్చి వేధించసాగింది. నేరం చేసిన అపరాధ భావం నా 'మంచితనాన్ని- సంస్కారాన్ని' నిలదీసేది. ఈ రకమైన మానసిక స్థితిలో వుండగానే మళ్ళీ సాహు ఉత్తరం 'మేడం....'

నాకు ట్రాన్స్ఫర్ అయింది. మీ ఇల్లు ఖాళీ చేస్తున్నాను. మీరు ఒకసారి రండి. నా స్థానంలో వచ్చిన కలీగ్ మీ ఇంట్లో కంటిన్యూ చేస్తానంటున్నాడు. మీరు వచ్చి ఆ ఫార్మాలిటీస్ చూసుకోగలరు. ఈనెలాఖరుకు నేను రిలీవ్ అవుతున్నాను. గమనించగలరు...'. సాహు గవర్నమెంట్ ఉద్యోగి మూడేళ్ళకోసారి బదిలీ తప్పదు. చెట్టు ఉదంతం బయటపడకుండా వుండాలంటే నేనే వెళ్ళాలి అతని ప్లేస్లో వచ్చినతనికి ఇల్లు అప్పగిస్తే మరో మూడేళ్ళపాటు ఇంటి సమస్య వుండదు.

''రండి... మేడం''.. చిరునవ్వుతో ఎదురొచ్చి నా చేతిలో బ్రీఫ్కేస్ తీసుకున్నాడు సాహు. విచ్చిపోయిన మల్లెలు, సంపంగుల వాసన గోడలుదాటి రోడ్డుమీదికి ప్రవహిస్తోంది. నాకెంతో ఇష్టమైన చిరపరిచితమైన పూల వాసన ఒక్కసారిగా ఏవేవో స్మృతులను ముచ్చెత్తి గుండెల్ని తడుపుతూ... 'రండి...' గేటువేసుకుని ముందు నడుస్తున్నాడు. సిమెంటు చేసిన కాలిబాటకి అటు, ఇటు లాన్. మధ్యమధ్య అందంగా అమర్చిన రోజ్ పాట్స్. టెర్రెస్ని ఆనుకుని పైన బాల్కనీలోకి ఎదిగిన మామిడి నిండా గుత్తులుగా పిందెలు- కాయల బరువుతో భూమిని చుంబిస్తున్న నిమ్మ, సపోటా... మేడ మెట్ల నానుకుని రివ్వటలా పెరిగిన జామ. అంతా అలాగే కాని... రెండడుగులు పక్కకి వేసి దక్షిణ భాగంవైపు చూసాను భయంగా. రివ్వున వీచిన గాలి తెరలో తేలికపాటి కమ్మని- వగరు వాసన ఆస్వాదించక ముందే నా మనసు పసికట్టింది. గాలి తాకిడికి రుసరుసమంటూ రెమ్మలు చేతులుచాచి స్వాగతం చెప్తున్నట్లు... ఆనందంగా నృత్యం చేస్తున్నట్లూ... అనిర్వచనీయమైన తన్మయభావంతో నా గుండె తడబడింది. చెట్టంత ఎదిగిన బిడ్డని అక్కున చేర్చుకున్నట్లు రెండుచేతులా మానును చుట్టుకుని గోడ మీదకు వంగిన చెట్టుకు తల ఆనించుకున్నాను. చాలాకాలం తరువాత నన్ను లాలించిన ప్రియ స్పర్శలా మొరటు బెరడు ఆసాంతం గుండెని కదిలించింది. 'మీ సెంటిమెంట్ నాకర్థమైంది. ఇంత ఎదిగిన చెట్టును కొట్టెయ్యటం నాకూ బాధనిపించింది. చెట్టూ బెండైనంతమేర గోడను సెట్ చేసి అటువైపు విస్తరించకుండా వేళ్ళను కొట్టించాను. ఇక చెట్టు ఎంత ఎదిగినా గోడ దెబ్బతినదు. హౌడూయూఫీల్ మేడం...'

సాహు గలగల చెప్తున్నాడు. గాలికి తెల్లని వేప పూలు నాపైన రాలుతున్నాయి. 'గోడకోసం నిన్ను కొట్టించెయ్యాలనుకున్నానే... నీకెందుకమ్మా... ఇంత ప్రేమ...' అవును చెట్టు మనిషినెప్పుడూ ప్రేమిస్తూనే వుంది. చెట్టుని ప్రేమించే మనిషి కావాలి. తనకోసమే... తన్ను తాను రక్షించుకోవటం కోసమే! మేడపై గదివరకు విస్తరించి ఠీవిగా ఆకాశమంత ఎత్తున వున్న మహావృక్షాన్ని తలపైకెత్తి రెప్పవాల్చక చూస్తున్నాను. రెండు వేప పూలు కోసి నోట్లోవేసుకుని చిరునవ్వుతో చూస్తున్నాడు సాహు. అప్రయత్నంగా అతని చేతులు నా రెండు చేతుల్లోనూ పట్టుకుని 'మంచి పనిచేసావు బాబూ! మా పచ్చని కలని నిలబెట్టావు! మనస్ఫూర్తిగా పలికి చెట్టుక్రింద బండమీద కూర్చున్నాను. ముదురుతున్న వేసవి రాత్రిలో వింజామరలు వీస్తూ... హంస తూలికల మీద స్వర్గలోకాలకు పోతున్న ఆనందాన్ని కలిగిస్తోంది వేపచెట్టు. ★